‘జగనన్న విద్యాదీవెన’పై హర్షం



విద్యతోనే అభివృద్ధి, పేదరిక నిర్మూలన సాధ్యమని బలంగా విశ్వసించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచి విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించారు. ఎన్నో సంస్కరణలు చేపడుతూ, విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. పేదరికం కారణంగా ఎవరి చదువులు ఆగిపోకూడదన్న సదుద్దేశ్యంతో జగనన్న విద్యాకానుక, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన పథకాల ద్వారా విద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తున్నారు. మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను తీర్చిదిద్దిన ఆయన నాలుగేళ్లుగా నిరంతరాయంగా ఆయా పథకాలు అందజేస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు. సోమవారం చిత్తూరు జిల్లాలోని నగరి వేదికగా జగనన్న విద్యాదీవెన పథకం నిధులను విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి నేరుగా జమచేశారు. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

–పార్వతీపురం, సాలూరు సాక్షి నెట్‌వర్క్

జగనన్న విద్యాదీవెన ఓ వరం..

జగనన్న విద్యాదీవెన పేదలకు ఓ వరం లాంటిది. బొబ్బిలిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఐటీఐ చదువుతున్న నాకు జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా అందుతున్న డబ్బులు బాగా ఉపయోగపడుతున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపంలో రెండేళ్ల పాటు ప్రభుత్వం అందించిన ఆర్థికసాయంతో సాఫీగా నా చదువు సాగుతోంది. మా ఇంటిపై చదువు భారం పడలేదు. సీఎం జగన్ సార్‌కు నా ధన్యవాదాలు.

–పట్నాన లక్ష్మణరావు, ఐటీఐ విద్యార్థి, కాశీపట్నం, మక్కువ మండలం.

ప్రభుత్వ సాయంతో ఉన్నత చదువులు..



రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థికసాయంతో నేను బీటెక్ వంటి ఉన్నత చదువు చదవగలుగుతున్నా. సెకండియర్ చదువుతున్న నాకు జగనన్న విద్యాదీవెన కింద ఫీజు రూపంలో చెల్లించాల్సిన మొత్తం అందుతోంది. మా అమ్మ గృహిణి, మా నాన్న స్కూల్‌బస్ డ్రైవర్. సీఎం జగనన్న చలవతో నా లాంటి ఎంతోమంది నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవగలుగుతున్నారు. సీఎం జగన్ సార్‌కు చాలా థ్యాంక్స్.

–పైల విజయకుమారి, బీటెక్ విద్యార్థి, పలగర గ్రామం, బలిజిపేట మండలం.

సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం..



మాలాంటి ఎన్నో నిరుపేద కుటుంబాల ఇళ్లల్లోని పిల్లలు బాగా చదివేలా పథకాలతో ప్రోత్సహిస్తున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం. మా అమ్మాయి ఏజీ బీఎస్సీ చదువుతోంది. ఈ ఏడాది జగనన్న విద్యాదీవెన పథకం కింద రూ.25 వేలు నా బ్యాంకు ఖాతాలో జమ అయింది. నాకు రుణమాఫీ, సున్నావడ్డీ పథకాలు కూడా వచ్చాయి. అన్ని వర్గాల ప్రజలకు జగనన్న ప్రభుత్వం వల్ల లాభం చేకూరుతోంది.

–పోల చిన్నమ్మలు, కృష్ణారాయపురం, సీతానగరం మండలం.

క్లుప్తంగా

ఎరువుల గొడౌన్‌లో విజిలెన్స్ తనిఖీలు



గొడౌన్‌లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

సాలూరు: మండలంలోని బాగువలస గ్రామంలో సుతాపల్లి విజయ్‌నగేష్‌కు చెందిన ఎరువుల గొడౌన్‌లో విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్ లేకుండా నిల్వచేసిన యూరియా, డీఏపీ, ఎంవోపీ ఎరువులను గుర్తించారు. వీటి విలువ దాదాపు రూ.1,73,243 ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ సింహాచలం, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సింహాచలం, కానిస్టేబుల్ పురుషోత్తం, ఇన్‌చార్జ్ ఏవో తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్న కాలనీల్లో గృహప్రవేశాలు



ఏగోటివలసలో జగనన్న కాలనీలో గృహప్రవేశం సందడి

సీతానగరం: మండలంలోని జగనన్న కాలనీల్లో గృహప్రవేశాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారంతా శ్రావణమాసం కావడంతో మంచి ముహూర్తాలు చూసుకుని, గృహప్రవేశాలు చేస్తుండడం గమనార్హం. నిర్మాణాలు సగంలో ఉన్న వారు కూడా తమ నిర్మాణాలను వేగవంతం చేసి, ఇదే శ్రావణమాసంలో గృహప్రవేశాలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మండలంలోని జోగింపేట, బుడ్డిపేట, నిడగల్లు గుచ్చిమి, కాశీపేట, జానుమల్లువలస గ్రామాల్లో గృహప్రవేశాలు జోరుగా జరుగుతున్నాయి. సోమవారం ఏగోటివలస జగనన్న కాలనీలో ఎన్.శ్రీనివాసరావు దంపతులు జగనన్న ప్రభుత్వం ఇచ్చిన ఇంట్లోకి గృహప్రవేశం చేసి, ఆనందించారు. ఇదే గ్రామంలో మరో నాలుగు కుటుంబాలు గృహప్రవేశాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

ఓటరుగా నమోదు కావాలి



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆర్‌డీవో హేమలత

పార్వతీపురంటౌన్: 18 ఏళ్ల వయసు నిండిన యువతీ,యువకులంతా ఓటరుగా నమోదు కావాలని ఆర్‌డీవో కె.హేమలత కోరారు. మండలంలోని వెంకంపేట గ్రామంలో జరుగుతున్న ఓట్ల తొలగింపు ప్రక్రియను ఆర్‌డీవో సోమవారం పరిశీలించారు. ఖచ్చితమైన ఓటర్ల జాబితా తయారీకి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణ, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని ఎదుర్కొనే సత్తా టీడీపీకి లేదు..

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

పార్వతీపురంటౌన్: వైఎస్సార్ సీపీని ఎదుర్కొనే సత్తా టీడీపీకి లేదని బీజేపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన టీడీపీలో అసమ్మతి పోరు ఎక్కువగా ఉందని, దీంతో ఆ పార్టీపై ప్రజల్లో అంతగా నమ్మకం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఎదురుదెబ్బ తప్పదన్నారు. బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులు మాత్రమే వైఎస్సార్ సీపీ అభ్యర్థులను సమర్థవంతంగా ఎదుర్కోగలరన్నారు.

వినతిపత్రం అందజేత

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో గతంలో పనిచేసిన ఆదివాసీ ఆరోగ్య సిబ్బందినే మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని గిరిజన సంఘం నాయకులు పల్ల సురేష్, పాలవలస భగవాన్, ఆరిక చంద్రశేఖర్, దుక్క సీతారాం, చెల్లూరు సీతారాం, జె.బంగార్రాజు, సంగమేష్, చంద్రయ్య కోరుతున్నారు. ఇదే విషయమై వారు పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మధ్య కాలంలో గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని, ఆదివాసీ ఆరోగ్య సిబ్బంది ఉన్నప్పుడు ఈ మరణాలు ఉండేవి కావన్నారు. విద్యార్థుల ఆరోగ్యం బాగుండాలంటే మళ్లీ పాత సిబ్బందినే విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

ఈ–క్రాప్ నమోదును వేగవంతం చేయాలి



కాశీపేటలో ఈ–క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏవో అవినాష్



బలిజిపేట: బర్లిలో ఈ–క్రాప్ నమోదు చేస్తున్న ఏవో శ్రావణ్

సీతానగరం: ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఏవో ఎస్.అవినాష్ సూచించారు. సోమవారం మండలంలోని చినభోగిలి, ఆర్.వెంకంపేట, కాశీపేట గ్రామాల్లో జరుగుతున్న ఈ–క్రాప్ నమోదును పరిశీలించిన ఆయన నిర్దేశిత గడువులోగా ఈ–క్రాప్ నమోదు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే ఈ ప్రక్రియ వల్ల కలిగే ప్రయోజనాలను, ఖరీఫ్ సాగులో అధిక దిగుబడులకు మెలకువలను రైతులకు వివరించాలని తెలిపారు. ప్రతీ రైతు తమ పంటకు సంబంధించి, ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని తెలిపారు.

బలిజిపేట: రైతులు తాము పండిస్తున్న పంటలకు సంబంధించి, ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో శ్రావణ్ సూచించారు. మండలంలోని మిర్తివలస, బర్లి గ్రామాల్లో జరుగుతున్న ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను సోమవారం పరిశీలించిన ఆయన ఈ–క్రాప్ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. సెప్టెంబర్ 15వ తేదీలోగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని, అనంతరం ఈకేవైసీ కూడా చేసుకోవాలని తెలిపారు. ఈ–క్రాప్ నమోదు చేసుకున్న వారికే ప్రభుత్వం కల్పించిన ధరకు పంట విక్రయించుకునే వీలుంటుందని, బీమా సౌకర్యం ఉంటుందని, సున్నా వడ్డీ రాయితీ లభిస్తుందని, ప్రభుత్వ పథకాలు కూడా వర్తిస్తాయన్నారు.

ఎస్పీతో ఎమ్మెల్యే భేటీ



ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో ఎమ్మెల్యే అలజంగి జోగారావు సోమవారం భేటీ అయ్యారు. కొత్తగా ఏర్పాటైన పార్వతీపురం మన్యం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న ఆయనకు అభినందనలు తెలిపారు. అలాగే జిల్లాలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు. భేటీలో జెడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో పనులు చేపట్టాలి: పీఓ



భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న పీఓ విష్ణు చరణ్

కురుపాం: మండలంలోని మొండెంఖల్ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు కార్యక్రమం కింద నిర్మిస్తున్న అదనపు భవనాలను పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ సోమవారం పరిశీలించారు. ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు చేపట్టాలని, సకాలంలో నిర్మాణాలు పూర్తిచేయాలని సూచించారు. ఆయన వెంట గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ అధికారి జె.శాంతీశ్వరరావు, ఏఈలు ఉన్నారు.

అర్హులందరికీ ‘ఉపాధి’ కల్పించాలి



వేతనదారులతో మాట్లాడుతున్న సీఆర్‌డీ రాష్ట్ర టీమ్ లీడర్ విజయలక్ష్మి

సీతానగరం: అర్హులందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని సీఆర్‌డీ రాష్ట్ర టీమ్ లీడర్ బి.పి.టి.విజయలక్ష్మి సూచించారు. మండలంలోని సూరంపేట రామమందిరం వద్ద ఉపాధి హామీ వేతనదారులతో సోమవారం సమావేశమైన ఆమె వారికి పనులు కల్పిస్తున్న తీరు, అందుతున్న వేతనం గిట్టుబాటు అవుతుందా లేదా, పని ప్రదేశంలో వారికి కల్పిస్తున్న సదుపాయాలపై ఆరాతీశారు. ఎస్‌ఆర్‌ఈజీఎస్ ముఖ్య ఉద్దేశ్యాలు నెరవేరేలా అధికారులు, సిబ్బంది వ్యవహరించాలని, పనులు కావాలనుకునే అర్హులందరికీ జాబ్‌కార్డులు అందజేసి, పనులు కల్పించాలన్నారు. అలాగే వేతనదారులతో నాణ్యమైన పనులు చేయించి, వారికి గిట్టుబాటు అయ్యే వేతనం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ అప్పలనరసమ్మ, మాజీ సర్పంచ్ సాంబందొర, ఏపీవో భాను, టీఏలు పాల్గొన్నారు.

గిరిజన స్పందనకు 49 వినతులు



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఐటీడీఏలో సోమవారం జరిగిన గిరిజన స్పందనకు 49 వినతులు వచ్చాయి. ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి వినతులు స్వీకరించారు. కేరాసింగికి చెందిన రూప జీవనోపాధి కల్పించాలని కోరారు. పిండిమిల్లు ఏర్పాటుకు రుణం మంజూరు చేయాలని దుగ్గికి చెందిన విజయ, కుట్టుమిషన్ ఇప్పించాలని బూర్జమానుగూడకు చెందిన పి.పార్వతి, లోకండకు చెందిన కృష్ణారావు కంప్యూటర్‌కాటా మంజూరు చేయాలని వినతిపత్రాలు అందజేశారు. ఇసుక రవాణాకు అనుమతించాలని చాపరాయిగూడకు చెందిన శంకరరావు, పింఛన్ మంజూరు చేయాలని రేణుగూడకు చెందిన ఎస్.గొరీష్, పంచాయతీ భవనం నిర్మించాలని పెద్దగూడ బాపయ్య అధికారులను కోరారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, ఈఈ సింహాచలం, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి, పీఏఓ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ జేఏసీ వినతి



ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘ నాయకులు

సీతంపేట: గిరిజనులపై దాడులను నిరసిస్తూ ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. సీతంపేట సంత మార్కెట్ నుంచి ఐటీడీఏ వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర శాంతియుతంగా ర్యాలీ చేపట్టారు. బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. ఐటీడీఏ ముఖద్వారం వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు బి.శ్రీనివాసరావు, హెచ్.ప్రసాదరావు, మోహనరావు మాట్లాడుతూ.. మణిపూర్‌లో గిరిజనులపై దాడులను ఖండిస్తున్నామన్నారు. స్థానికంగా గిరిజనేతరుడైన పి.లోకేశ్వరరావు ఇద్దరు గిరిజన మహిళా ఉపాధ్యాయులను కులం పేరుతో దూషించినందుకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణ వేగవంతం చేయాలన్నారు. కోర్టు తీర్పులు వెలువరించిన 29 ఎల్‌టీఆర్ కేసులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఐదో షెడ్యూల్డ్ ప్రాంతంలో 1/70, పీసా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, జీఓ–3ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ నాయకులు ఎం.రామారావు, కె.భాస్కరరావు, జాన్‌సింహాచలం, పి.పురుషోత్తం, ఎస్.కాంతారావు, బి.ఉమామహేశ్వరరావు, అజయ్‌కుమార్, డి.గణేష్, చంటి, ఎస్.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: స్థానిక పట్టణంలోని 8వ వార్డు పరిధిలోని పెద్దవీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు సోమవారం భూమిపూజ చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంతానికి వచ్చిన ఎమ్మెల్యే దృష్టికి ఇక్కడి సచివాలయం–3 నుంచి కేపీఎం పాఠశాల వరకు శిథిలావస్థకు చేరుకున్న రోడ్డు సమస్యను తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా కృషి చేయగా, ఇప్పుడు విడుదలైన నిధులతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. అన్ని ప్రాంతాలు బాగుండడంతో పాటు అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని, అందుకే ఆయన ఓ వైపు అభివృద్ధి చేస్తూనే సంక్షేమాన్ని పరుగులు తీయిస్తున్నారన్నారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ద్వారా ప్రజాసమస్యలు పరిష్కారం కావడంతో పాటు అభివృద్ధి పనులు జరుగుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టి, పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, మరోసారి సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్ సభ్యులు పి.జయంతి, బి.ఆనంద్, కో–ఆప్షన్ సభ్యులు మెరువ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



కొత్తగా నియమితులైన పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. పార్వతీపురం మండలం నుంచి వైఎస్సార్ సీపీ సీనియర్ నేత వెంపలి గురురాజు జిల్లా పార్టీ జనరల్ సెక్రటరీగా, మరో నేత కోట సంజీవి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులైన నేపథ్యంలో వారిని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సోమవారం సత్కరించి, అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారికి పార్టీలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని, వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ కష్టాన్ని గుర్తించి, ఈ పదవులకు తమ పేర్లను సిఫార్సు చేసిన ఎమ్మెల్యేకి కృతజ్ఞతలన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్



ప్రజాసమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావును మండలంలోని పిన్నింటి రామినాయుడువలస గ్రామానికి చెందిన తోటపల్లి ప్రాజెక్టు నిర్వాసితులు సోమవారం కలిసి, తమ సమస్యలు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే వారి సమస్యల పరిష్కారంతో పాటు ప్రజల దీర్ఘకాలిక సమస్య అయిన ఇళ్ల నిర్మాణం, బిల్లుల చెల్లింపులు తదితర అంశాలపై హౌసింగ్ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కొత్తగా ఇళ్ల నిర్మాణాలు చేయాలనుకునే వారికి అవసరమైన అలాగే కొత్తగా ఇళ్ల నిర్మాణం చేసుకోదలచుకున్న వారికి అవసరమైన సహాయ, సహకారాలు అందివ్వాలని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ డీఈ ప్రసాదబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోండి: డీఐఓ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఐఓ జగన్మోహనరావు

గరుగుబిల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా అందజేస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని చిలకాం పంచాయతీ దత్తివలస గ్రామంలో చేపట్టిన ‘ఫ్యామిలీ డాక్టర్’ వైద్యశిబిరాన్ని సోమవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 104 వాహనంలో అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, రోగ నిర్ధారణ పరీక్షల కిట్లు, మందులను పరిశీలించారు. గర్భిణులకు 104 వైద్య సిబ్బంది నిర్వహించిన ఈసీజీ రిపోర్టును పరిశీలించారు. అనంతరం ఓపీలో నమోదు చేసిన రోగుల అనారోగ్య సమస్యలు, వారికి నిర్వహించిన పరీక్షలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. వివరాలను ఎఫ్‌డీపీ యాప్‌లో నమోదు చేయాలన్నారు. సీజనల్ జ్వరాలు గుర్తిస్తే వెంటనే తగిన చికిత్స అందించాలని సూచించారు.

కార్యక్రమంలో రావివలస పీహెచ్‌సీ వైద్యాధికారి కె.అరుణకుమారి, సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది సోములమ్మ, దుర్గాభవానీ, 104 సిబ్బంది శివగణేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత



కొత్తగా ఎంపికైన వలంటీర్లకు నియామక పత్రాలు అందిస్తున్న ఎంపీపీ

వీరఘట్టం: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు సూచించారు. ఇటీవల కొత్తగా ఎంపికైన ఐదు గ్రామాలకు చెందిన వలంటీర్లకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, తలవరం సర్పంచ్ శిష్టు మధుసూదనరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రంభ శ్రీనివాసరావు, గుంట్రెడ్డి గౌరీశంకరరావు, ఆబోతుల దాలినాయుడు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి



సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పాలకొండ రూరల్: ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని సీపీఎం నాయకులు నినదించారు. మండలంలోని మల్లమ్మగూడలో సోమవారం సమరభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు డి.రమణారావు మాట్లాడుతూ.. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 4 వరకు సమరభేరి కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.మజ్జయ్య, భానుచంద్ర, మోహన్, సాంబమూర్తి, రమేష్, సింహాచలం తదితరులున్నారు.